## క్లుప్తంగా

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ కార్యదర్శి రవి తెలిపారు. ఆయన శనివారం చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నూతనంగా ఎంపికైన వారికి నియామక ప్రతాలు అందజేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజగోపాల్, మానవ హక్కుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డేవిడ్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సురేంద్రను నియమించామని తెలిపారు.

### వరసిద్ధుని దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి



స్వామి చిత్ర పటం అందుకుంటున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి ప్రమోద్‌కుమార్ అగర్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది కోదండపాణి, సురేష్ ప్రసాదంతో పాటు చిత్ర పటం అందజేసి సత్కరించారు.

### దోమల లార్వాలను నిర్మూలించాలి



వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రజలు పరిసరాల్లో నిలువ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలను నిర్మూలించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో తగినంత వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. వాతావరణం మారిన నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటాయని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పిల్లలను పనుల్లో పెట్టుకుంటే జైలు ఖాయం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న మండల అధికారులు

పలమనేరు: పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానులు జైలుకెళ్లడం ఖాయమని పలమనేరు సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదేశాలతో పట్టణంలోని పలుచోట్ల హోటళ్లు, మెకానిక్, వెల్డింగ్ దుకాణాల్లో శనివారం మండల న్యాయసేవా అధికార సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తనిఖీలు చేశారు. దీనిపై దుకాణదారులకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని జడ్జి తెలిపారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడికి పంపాలని సూచించారు. మైనర్లతో వెట్టి చాకిరీ చేయించడం మంచిది కాదన్నారు. ఇందులో సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్యశిబిరం

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లిలో నేడు ఆదివారం కుప్పం బీఆర్‌డీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చింతమాకులపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కోనేటిరాయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



అన్నదానం చేస్తున్న దాతలు

గంగవరం: పెరటాసి నెల మూడో శనివారం కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలువురు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. 9 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. దాతల సహకారంలో ఆలయంలో అన్నదానం చేశారు.

# పెరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు

- నియోజవర్గంలో 10 వేల మంది చిరువ్యాపారులు
- ఎక్కడా చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు పెరుగుతున్న ఆదరణ



చిల్లర దుకాణంలో ఏర్పాటు చేసిన పేమెంటు స్కానర్ బాక్స్

చిత్తూరు కార్పొరేషన్: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చేవాళ్లం. ఇప్పుడు కాలం మారింది. టీ తాగాలన్నా, మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేయాలన్నా, ఇతర ఏ వస్తువులు కొనాలన్నా చేతిలో నగదు ఉండాల్సిన అవసరం లేదు. జేబులో ఓ స్మార్ట్ ఫోన్, ఖాతాలో డబ్బు ఉంటే చాలు.. ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే, క్యూ ఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదు.

**నియోజకవర్గంలో 10వేల దుకాణాలు**

ప్రస్తుతం స్కానర్లు చిరువ్యాపారులకు సైతం అందుబాటులో వచ్చాయి. డిజిటల్ లావాదేవీల పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్ స్కానర్లు, స్పీకర్లు పెడుతున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో మొత్తం చిల్లర అంగళ్లు, టీ అంగళ్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ దుకాణలు వంటివి దాదాపు 10 వేల వరకు ఉంటాయి. వీటిలో రోజూ రూ.3వేల నుంచి రూ.50 వేల వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. వీటితో దాదాపు 50 శాతం వరకు లావాదేవీలు డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్కానర్ ద్వారా చెల్లింపు సేవలు ఉచితంగా అందిస్తున్నట్టు పేర్కొన్నారు. స్పీకర్ బాక్స్ పెడితే కంపెనీలను బట్టి మినిమం చార్జీలు ఉంటాయి. స్పీకర్ బాక్స్ పెడితే నెలకు రూ.120 వరకు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. 300 లావాదేవీలు లోపలైతే వ్యాపారి రూ.90 కట్టాల్సి వస్తుంది.

**కోవిడ్‌తో మార్పులు**

దేశంలో 2016లో పెద్ద నోట్లను రద్దు చేశారు. అనంతరం ఆర్థిక లావాదేవీల పేమెంట్లను ప్రోత్సహించారు. అది పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైంది. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్తుందనే ఆపోహ, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ప్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఫుడ్ డెలివరీ, ఇతర ఆర్థిక లావాదేవీల వరకు ఈ యాప్‌ల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**చిరు వ్యాపారుల చెంతకు**

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు. చిరువ్యాపారాలు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో చిల్లర సమస్య ఉండడం లేదు.. పేమెంట్ యాప్‌లకు సంబంధించి క్యూర్‌కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా స్కానర్ స్టిక్కర్ బోర్డులు కనిపిస్తున్నాయి.

**స్పీకర్‌తో చెక్**

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారునికి అమౌంట్ పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. మార్కెట్‌ల్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్‌పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ఐరాల: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరసింహులు హెచ్చరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ మద్యపానం సేవించే 8 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని శనివారం చిత్తూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

### 61 మందికి ఉద్యోగ అవకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 61 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ, నైపుణ్యాభివృద్ధి శాఖ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి 131 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వారిలో 61 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. ఐటీఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## భర్త విగ్రహాన్ని ప్రతిష్టించిన భార్య



సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పూతలపట్టు: పూతలపట్టు మాజీ వైస్ ఎంపీపీ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి సేవలు మరవలేనివని ఆయన భార్య, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా కార్యదర్శి గౌహతిరెడ్డి తెలిపారు. ఆమె శనివారం పూతలపట్టులోని తమ నివాసంలో భర్త విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం శ్రమించిన నాయకుల్లో సుబ్బారెడ్డి ఒకరిని తెలిపారు. ఆయన ప్రస్తుతం భౌతికంగా లేకపోయినా పూతలపట్టు ప్రజల గుండెల్లో ఉన్నారని తెలిపారు. తన భర్త సుబ్బారెడ్డిని దైవంగా భావించి ఆయన విగ్రహాన్ని ఇంటిలోనే ఏర్పాటుచేసినట్టు తెలిపారు. తన భర్త అడుగుజాడల్లో నడుస్తూ వైఎస్సార్ సీపీ బలోపేతంతోపాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కష్టపడతానన్నారు. జెడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, చిత్తూరు 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణిరెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు అమర్నాథరెడ్డి, సుధీర్‌రెడ్డి, దయాశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన శేఖర్

గుడిపాల: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో శనివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ రామ్మోహన్ కథనం మేరకు..189 కొత్తపల్లెకు చెందిన శేఖర్(55), చుక్కావారిపల్లెకు చెందిన తమివనన్(45) బైకుల్లో వస్తూ ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108లో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనులపండుగగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవలింపు సేవ నిర్వహించారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అటవీశాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ కోరారు. జిల్లాలో 100 మందికి పైగా పలు పథకాల కింద కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, బేస్ క్యాంప్, చెక్‌పోస్టులు, ఇతర విభాగాల్లో ప్రొటెక్షన్ వాచర్స్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల కొందరిని పలు కారణాలతో తొలగించారని, వీరిపై ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పలు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం వస్తోందని వెల్లడించారు. అప్కాస్‌లో కింద ఉద్యోగులను చేర్చి రూ.25 వేలు జీతం ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## రెండు తాగునీటి శుద్ధి యంత్రాల వితరణ



అర్ధగిరి క్షేత్రంలో ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫైయర్స్ వితరణ చేస్తున్న సప్తగిరి బ్యాంక్ అధికారులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్టు అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం బ్యాంక్ తరపున రూ.20 వేల విలువైన రెండు ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫయర్స్ ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి, సిబ్బందికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



కార్యక్రమంలో కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన తాత్కాలిక రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు. పరిపాలన సౌలభ్యం కోసం చిత్తూరు అర్బన్, రూరల్‌గా విభజించామని వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్బన్, రూరల్ మండలానికి కలిపే ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉండేది. దీనిపై గత పాలకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం విభజనకు అంగీకరించి.. మండల తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కార్యక్రమంలో మండల తహసీల్దార్ లోకేశ్వరి, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, శశికరబాబు పాల్గొన్నారు.

## లక్ష్యంవైపు ధైర్యంగా ముందుకెళ్లాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు అనుకున్న లక్ష్యం సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ఇరువారం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో శనివారం ఆర్‌కే డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓటమికి భయపడకూడదన్నారు. కరస్పాండెంట్ బద్రినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ద్వేషం, అహం, చదువు పట్ల నిర్లక్ష్యాన్ని జయిస్తేనే విజయం సాధించగలరన్నారు. సామాజిక మాధ్యమాలను మంచి కోసమే వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు.

# అన్నపూర్ణగా బోయకొండ గంగమ్మ











బంగారుపాళెం: అన్నపూర్ణగా వజ్రాలపురం గంగమ్మ, బంగారుపాళెం: గాయత్రీదేవిగా ముత్యాలమ్మ, ప్రత్యేక అలంకారంలో ఓంశక్తి అమ్మవారు, గుడిపాల: లలితాదేవిగా ములస్థాన దుర్గమ్మ, ఐరాల: అన్నపూర్ణాదేవిగా పాలేటమ్మ

బంగారుపాళెం: దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వజ్రాలపురం బోయకొండ గంగమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన నాగరత్నమ్మ జనార్థన్‌నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ శనివారం గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన లోకనాథపిళ్లై, కామరాజు, భాస్కర్, బాబూరావు, కుమారస్వామి ఉభయదారులుగా వ్యవహరించారు. ఓంశక్తి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

**అన్నపూర్ణాదేవిగా పాలేటమ్మ**

ఐరాల: స్థానిక గ్రామదేవత పాలేటమ్మ శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం పాలేటమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పాతపాళ్యం ఓం శక్తి ఆలయం, వైఎస్.గేటు చాముండేశ్వరి ఆలయంలో అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా భక్తులకు కటాక్షించారు.



తవణంపల్లె: సత్యమ్మను దర్శించుకుంటున్న భక్తులు

**సత్యమ్మకు ప్రత్యేక అలంకరణ**

తవణంపల్లె: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సత్యమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కె.పట్నంలో సత్యమ్మకు భక్తులు విశేష అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ, గంధం, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు.

**లలితాదేవిగా దుర్గాంబ**

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం చిత్తూరు గిరింపేటలోని దుర్గాంబ శ్రీ లలితాదేవిగా దర్శనమిచ్చారు. రాములగుడివీధిలోని కోదండరామస్వామి ఆలయంలోని రాములవారు కూర్మావతంలో భక్తులను కటాక్షించారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి శాకంబరి, అర్థనారీశ్వరి అలంకారాల్లోనూ, శ్రీవిశ్వ షిరిడిబాబా ఆలయంలో అన్నపూర్ణదేవిగా భక్తులను అనుగ్రహించారు. దుర్గాంబ ఆలయంలో నిర్వాహకులు దిలీప్‌రెడ్డి, మునిశేఖర్ పసుపు, కుంకుమ, పూజ సామగ్రి, ఉభయదారులకు పండ్లు, తదితరాలను పంపిణీ చేశారు.



ఐరాల: అన్నపూర్ణాదేవిగా చాముండేశ్వరి

**లలితా దేవి అలంకరణలో దుర్గమ్మ**

గుడిపాల: కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ శనివారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరులోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గంగమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

### వంద రోజులు పనులు కల్పించండి

- పీడీ రవికుమార్



మాట్లాడుతున్న పీడీ రవికుమార్

చౌడేపల్లె: వలసల నివారణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలని డ్వామా పీడీ రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఎస్‌ఎస్‌ఏ, వివిధ శాఖల అనుసంధానం ద్వారా 1,707పనులకుగాను రూ.7.08 కోట్ల నిధులు వేతనాలుగా, మెటీరియల్ రూపంలో చెల్లించామన్నారు. సామాజిక తనిఖీ బృందం 15 రోజులపాటు పనులను రికార్డుల ఆధారంగా తనిఖీ చేసి గుర్తించిన అంశాలను వెల్లడించారు. పండ్లతోటల పెంపకం, భూగర్భజలాలను పెంచే పనులపై దృష్టిపెట్టాలన్నారు. తనిఖీల్లో రూ.28వేల రికవరీకి ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందికి జరిమానాలు విధించారు. డీవీఓ ఉమావాణి, ఏపీడీ రవికుమార్, ఏపీఓ శ్రీనివాస్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



పూజల్లో జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని తోటకనుమ పంచాయతీ మోర్నపల్లిలో శనివారం లక్ష్మణస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు.